సాక్షి సిద్దిపేట

మంగళవారం ၊ 29 ၊ జూలై ၊ 2025



బందీ అయిన బాల్యం

బడిలో చదువుకుంటూ సరదాగా గడపాల్సిన చిన్నారుల బాల్యం పనుల్లో బందీ అవుతోంది. వివరాలు 8లో ▸



నవోదయలో ప్రవేశాలు

వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి నోటిఫికేషన్ వెలువడింది. వివరాలు 8లో ▸

మల్లన్న ఆలయంలో ఆడిట్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి ఆలయంలో 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయాలపై ఆడిట్ ప్రారంభమైంది. జిల్లా ఆడిట్ అధికారి జయలక్ష్మీ ఆధ్వర్యంలో సోమవారం కొనసాగింది. ఈ ఆడిట్ నాలుగు రోజులపాటు కొనసాగనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

దూరవిద్యలో చేరేందుకు గడువు పొడిగింపు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఉన్నత విద్యను అభ్యసించేందుకు దూర విద్యలో చేరాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ కోఆర్డినేటర్ శ్రద్ధానందం కోరారు. డిగ్రీ, పీజీ కోర్సులలో అడ్మిషన్లు పొందేందుకు ఆగస్టు 13వరకు గడువును పొడిగించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని దూర విద్య ప్రాంతీయ కార్యాలయం వద్ద మాట్లాడారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను డిగ్రీ, ప్రథమ, ద్వితీయ, తృతీయ కోర్సులతో పాటు పీజీ కోర్సులలో చేరేందుకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా వచ్చేనెల 13 వరకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. సంబంధిత వెబ్‌సైట్‌లో ఆన్‌లైనలో రిజిస్ట్రేషన్ చేసుకుని అభ్యాసకుల సహాయ కేంద్రంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు సర్టిఫికెట్లను ప్రాంతీయ కార్యాలయంలో సమర్పించి అడ్మిషన్ పొందాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 73892 29615 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కేజీబీవీలలో ఖాళీ సీట్ల భర్తీకి చర్యలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఖాళీగా ఉన్న సీట్లను మంగళవారం నుంచి భర్తీ చేస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తెలిపారు. విద్యార్థినులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత మండలంలోని కేజీబీవీలో ప్రత్యేక అధికారిణి సంప్రదించాలన్నారు.

అక్రమంగా యూరియా నిల్వ చేస్తే చర్యలు



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐలు వాసుదేవరావు, ఉపేందర్

సిద్దిపేటకమాన్: యూరియాను అక్రమంగా నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు వాసుదేవరావు, ఉపేందర్ హెచ్చరించారు. సిద్దిపేట పట్టణంలోని పలు సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల్లో అర్బన్ వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌తో కలిసి వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్ సోమవారం తనిఖీ నిర్వహించారు. దుకాణాల్లోని స్టాక్, డెలివరీ రిజిస్టర్లు, బిల్ బుక్, ఇతర రికార్డులను, సీడ్స్, ఫర్టిలైజర్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులను మోసం చేసే యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు యూరియా వాడుకోవాలని సూచించారు. అక్రమంగా యూరియా నిల్వ చేస్తే డయల్ 100 లేదా సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు.

గడువు ముగిసిన మందులు ఉంచకూడదు

డీఎంహెచ్‌ఓ ధనరాజ్

సిద్దిపేటకమాన్: గడువు ముగిసిన మందులు నిల్వ ఉంచకూడదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధనరాజ్ తెలిపారు. సిద్దిపేటలోని కేసీఆర్ నగర్ బస్తీ దవాఖాన, అంబేడ్కర్ నగర్ అర్బన్ సెంటర్‌ను డీఎంహెచ్‌ఓ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్లలోని సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను, మందులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తాగే నీరు కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు, ఆరోగ్య సమస్యలకు సంబంధించి మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ భిక్షపతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి ఎడ్ల లక్ష్మికి సన్మానం



కవయిత్రి ఎడ్ల లక్ష్మిని సన్మానిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాకు చెందిన ప్రముఖ కవయిత్రి ఎడ్ల లక్ష్మిని కవులు సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. మహారాష్ట్రలోని తెలుగు పుస్తకంలో ఎడ్ల లక్ష్మికి సంబంధించిన అచ్చుల పాట గేయం ప్రచురితం కావడంపై కవులు హర్షం వ్యక్తం చేశారు. ఎడ్ల లక్ష్మిని సన్మానించిన అనంతరం కవులు మాట్లాడుతూ జాతీయస్థాయిలో సిద్దిపేట ఖ్యాతిని నిలిపినందుకు అభినందించారు. కార్యక్రమంలో కవులు ఐత చంద్రయ్య, ఎన్నవెల్లి రాజమౌళి, ఉండ్రాళ్ళ రాజేశం, లక్ష్మయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బడి నిధులు గోల్‌మాల్!

'పీఎం శ్రీ' వ్యయంపై కాకిలెక్కలు

పీఎం శ్రీ కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు అవగాహన కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యారంగంలో మెరుగైన సౌకర్యాలు, మార్పులు తీసుకు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకాన్ని తీసుకువచ్చింది. పలు పాఠశాలు, మోడల్ స్కూళ్లలో ఇదే అదనుగా భావించి పలువురు అక్రమాలకు పాల్పడినట్లుగా జోరుగా చర్చ సాగుతోంది. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో లెక్కల్లో ఖర్చులు చూపించారు కానీ క్షేత్రస్థాయిలో అమలు చేయలేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేయాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి, సిద్దిపేట



జగదేవ్‌పూర్ మండలంలోని పాఠశాలలో నిర్మాణ దశలో ఉన్న సెల్ఫీ పాయింట్

- పలు చోట్ల ఖర్చు చేయకుండానే చేసినట్లుగా నమోదు
- పథకం కింద 33 పాఠశాలలు ఎంపిక
- జిల్లా వ్యాప్తంగా రూ.6కోట్లు కేటాయింపు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

జిల్లా వ్యాప్తంగా 2024–25లో 33 పాఠశాలలను పీఎం శ్రీ కింద ఎంపిక చేశారు. అందులో జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీ పాఠశాలలు 16, గురుకుల పాఠశాలలు 7, మోడల్ స్కూల్‌లు 10 ఉన్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విజ్ఞానయాత్రలు (ఎక్స్‌కర్షన్), పాఠశాల వార్షికోత్సవం, అదనపు తరగతి గదుల నిర్మాణం, సైన్స్‌ల్యాబ్‌లు, మరమ్మతులు, సెల్ఫీ పాయింట్‌లను నిర్మించాలని నిర్ణయించారు. దీని కోసం దాదాపు రూ.6కోట్ల నిధులను నేరుగా హెచ్‌ఎం బ్యాంక్ అకౌంట్లకు బదిలీ చేశారు. ఈ కేంద్రం 60శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను కేటాయించారు.

టూర్‌కు తీసుకెళ్లకుండానే..

అలాగే విజ్ఞాన యాత్ర కోసం ఒక్కో విద్యార్థికి రూ.500 చొప్పున కేటాయించారు. పలు పాఠశాలలు సగం మంది విద్యార్థులనే తీసుకెళ్లి అందరినీ తీసుకు వెళ్లినట్లు లెక్కలు చూపించినట్లు తెలిసింది. సిద్దిపేట నియోజకవర్గంలో ఓ మండలంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులను టూర్‌కు తీసుకు వెళ్లకుండానే రూ.1.68లక్షలు ఖర్చు చేసినట్లు చూపించే ప్రయత్నం చేశారు. ఉన్నతాధికారులు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని వెంటనే తీసుకెళ్లాలని ఆదేశించారు. దీంతో సగం మందినే తీసుకెళ్లి.. అందరినీ తీసుకవెళ్లినట్లు రికార్డుల్లో నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పాఠశాలల వార్షికోత్సవాలు మొక్కుబడిగా నిర్వహించి డబ్బులు స్వాహా చేశారని పలువురు ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. ఇలా పలు పాఠశాలలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా ఉన్నత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వాల లక్ష్యం నెరవేర్చేలా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

కన్పించని సెల్ఫీ పాయింట్‌లు

విద్యార్థి ప్రతిభ కనబరిస్తే అక్కడే ఫొటోను తీసి వారి పేరెంట్స్‌కు షేర్ చేసి ప్రోత్సహించాలని కేంద్రం నిర్ణయించింది. ప్రధాన మంత్రి చిత్రంతో, పాఠశాల భవనం, జాతీయ జెండా, పీఎం స్కూల్ పేరుతో ప్రత్యేకంగా రూపొందించాలని ఆదేశించారు. దీని కోసం ఎంపిక చేసిన ఒక్కో పాఠశాలకు రూ.20వేల చొప్పున నిధులను మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని పాఠశాలలో మాత్రమే నిబంధనల ప్రకారం ఏర్పాటు చేశారు. మరికొన్ని పాఠశాలలో కేవలం ఫ్లెక్సీలు మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. ఫ్లెక్సీకి, స్టాండ్‌కు కలిపి దాదాపు రూ.1,500 నుంచి రూ.2వేలు మాత్రమే ఖర్చు చేసి మిగతా డబ్బులను పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు. మిరుదొడ్డిలోని గురుకుల పాఠశాలలో సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయలేదు. బెజ్జంకి మోడల్ స్కూల్, కోహెడ గురుకుల పాఠశాలతో పాటు చాలా పాఠశాలలో కేవలం ఫ్లెక్సీలనే ఏర్పాటు చేశారు. జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో సెల్ఫీ పాయింట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది.



కోహెడలోని గురుకుల పాఠశాలలో కేవలం ఫ్లెక్సీ ఏర్పాటు..

విచారణ చేపిస్తా



పీఎం శ్రీ నిధులను పాఠశాలలో ఎంత వరకు వినియోగించారన్న విషయంపై విచారణ చేపిస్తాను. తప్పు అని తేలితే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ లక్ష్యం మేరకు నిధులను ఖర్చు చేయాలి.

– శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ

జాతీయ కార్యక్రమానికి వర్గల్ పాఠశాల

నేడు ఆన్‌లైన్ ద్వారా పాల్గొనే అవకాశం

వర్గల్(గజ్వేల్): కేంద్ర విద్యాశాఖ నిర్వహించనున్న జాతీయ కార్యక్రమానికి వర్గల్ పీఎం శ్రీ జిల్లాపరిషత్ హైస్కూల్ భాగస్వామ్యం కానుంది. మంగళవారం ఢిల్లీలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమం కోసం జిల్లాకు ఒకటి చొప్పున పీఎం శ్రీ స్కూల్స్‌ను ఎంపిక చేశారు. పీఎంశ్రీ నిధులు సద్వినియోగం చేసుకుంటూ, విద్యార్థులలో విద్యాప్రమాణాలు పెంచుతూ, పథకం లక్ష్యాల వైపు సాగుతున్న స్కూళ్లను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా వర్గల్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ ఎంపికై ంది. 466 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో పీఎంశ్రీ ద్వారా 20 కంప్యూటర్లతో ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్, టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ, ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ వొకేషనల్ కోర్సులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా అదనపు తరగతి గది, ల్యాబ్, లైబ్రరీ రూంలు నిర్మాణంలో ఉన్నాయి. వివిధ ప్రాంతాలకు విద్యార్థుల విజ్ఞానయాత్రలు, ఏక్‌భారత్–శ్రేష్ఠభారత్ తదితర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుని కేంద్ర విద్యాశాఖ నిర్వహిస్తున్న జాతీయస్థాయి కార్యక్రమానికి వర్గల్ పీఎంశ్రీ హైస్కూల్ ఎంపికైందని, ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యే అవకాశం దక్కిందని ఇంచార్జి హెచ్‌ఎం సుధారాణి తెలిపారు.



వర్గల్ కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు

హామీలు అమలు చేయాల్సిందే

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చంద్రం డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ బోర్డ్ చైర్మన్‌గా ప్రభుత్వం కార్మికుడిని ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన కార్మికులకు రూ. పది లక్షల రుణం పనిముట్లు కోసం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ కూలీలను సంక్షేమ బోర్డ్ నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యులు వర్మ, మాజీ జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, సంఘం నాయకులు రాములు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చంద్రం

నిన్న చిరుత.. నేడు తోడేలు

జంగపల్లి వాసులను కలవర పెడుతున్న అడవి జంతువులు



మేక కళేబరం



సీసీ కెమెరాలో చిక్కిన తోడేలు

మిరుదొడ్డి(దుబ్బాక): మొన్నటి వరకు చిరుత పులి సంచారంతో భయాందోళనకు గురైన జంగపల్లి గ్రామస్తులకు పంట పొలాల్లో గుర్తు తెలియని అడవి జంతువు మేకను చంపి తినడంతో మరోసారి కలవర పడుతున్నారు. ఎప్పుడు ఏ జంతువు వచ్చి దాడి చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. సోమవారం అటవీ శాఖ అధికారులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్బర్‌పేట–భూంపల్లి మండలం జంగపల్లి అటవీ ప్రాంతంలో చిరుత సంచరించిన విషయం విదితమే. గ్రామ శివారు పంట పొలాల్లో ఆదివారం సాయంత్రం మేక కళేబరం బయట పడింది. వెంటనే విషయాన్ని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాలను అమర్చి నిఘా పెంచారు. అదే రాత్రి సీసీ కెమెరా ఫుటేజీల్లో తోడేలు తిరుగుతున్న ఆనవాళ్లు కపించాయి. సీసీ కెమెరాల్లో చిక్కిన తోడేలుపై జంగపల్లి వాసులకు అటవీ శాఖ సెక్షన్ అధికారి మల్లేశం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలో చిక్కిన జంతువును తోడేలుగా నిర్ధారించినట్లు తెలిపారు. చిరుత దాడి చేస్తే జంతువుల మెడ వద్ద గాయం చేసి చంపుతుందన్నారు. మేక కళేబరాన్ని పరిశీలించిన పిమ్మట మేక పొట్ట భాగాన్ని తిని వదిలేయడాన్ని చూస్తే తోడేలు, లేదా నక్కగా నిర్ధారిస్తున్నట్లు తేల్చి చెప్పారు. కాగా ప్రస్తుతం చిరుత పులి అటవీ ప్రాంతంలో తిరుగుతున్న ఆనవాళ్లు లేవని, అయినా జనాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవైనా అడవి జంతువులు కనపడితే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

నేడు నాగుల పంచమి



శ్రావణమాసం అంటేనే పండుగలు, పూజలకు నెలవు. ఈ మాసంలో మొదటగా వచ్చే పండుగ నాగుల పంచమి. ఈ సందర్భంగా జిల్లాలోని నాగదేవత ఆలయాలు ముస్తాబయ్యాయి. సిద్దిపేట కోటిపడగల సంతాన నాగదేవత ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. మంగళవారం ఆలయంలో జరగనున్న పంచమికి జిల్లా నుంచే కాకుండా రాజన్న సిరిసిల్లా, నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్, మేడ్చల్, జనగాం, రంగారెడ్డి తదితర జిల్లాలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఈ ఆలయంలోని నాగదేవత అమ్మవారు విశేష పూజలు అందుకుంటారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి

అర్జీలను సత్వరం పరిష్కరించండి

- కలెక్టర్ హైమావతి
- ప్రజావాణికి 120 దరఖాస్తులు

సిద్దిపేటరూరల్: జిల్లాలోని ప్రజలు ప్రజావాణిలో అందించిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పలు రకాల సమస్యల పరిష్కారం కోరుతూ 120 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్ నిలిపివేయండి

ఎస్సీ వర్గీకరణతో మాలలు విద్య, ఉద్యోగ రంగాల్లో నష్టపోతున్నారని, ఎస్సీ కులాల రోస్టర్ పాయింట్లు సవరించే వరకు ఉద్యోగ నోటిఫికేషన్‌ను నిలిపివేయాలంటూ మాలమహానాడు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం రోస్టర్ విధానాన్ని సవరించి గ్రూప్–3లోని కులాలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, ప్రచార కార్యదర్శి దేవదాస్, పట్టణ అధ్యక్షులు బాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపన ఎంతో ముఖ్యం

సిద్దిపేటరూరల్: జిల్లాలోని యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించేందుకు గాను పరిశ్రమలు స్థాపించడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీజీఐపాస్‌లో వివిధ పరిశ్రమలు నెలకొల్పడానికి పెట్టుకున్న అన్ని దరఖాస్తులు ఆయా విభాగాల వారీగా పరిశీలన చేయాలన్నారు. ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల స్థాపన ఎంతో ముఖ్యమైందన్నారు. కమిటీ సభ్యుల సమక్షంలో ఎస్సీలకు 3, ఎస్టీలకు 3 చొప్పున యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు ఆమోదించారు. ఈ కమిటీలో పరిశ్రమల శాఖ అధికారి గణేశ్‌రామ్, ఎల్డీఎం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

సిద్దిపేటరూరల్: అత్యవసర వైద్యం కోసం వచ్చిన రోగులకు వైద్యులు ఓపికతో వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. రాత్రి సమయాల్లో ఆస్పత్రికి వచ్చే వారికి వైద్య సేవలు అందించాలన్నారు.



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

పూలే డిగ్రీ విద్యార్థినులకు 16 పతకాలు

వర్గల్(గజ్వేల్): నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో వర్గల్ పూలే మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటి 16 పతకాలు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు తెలిపారు. మేడ్చల్‌లో ఆదివారం డైనమిక్ షోటకాన్ కరాటే ఆర్గనైజేషన్ నిర్వహించిన ఈ పోటీలలో 16 మంది పూలే విద్యార్థినులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అందులో నలుగురికి బంగారు, ఆరుగురికి వెండి, ఆరుగురికి కాంస్య పతకాలు లభించాయన్నారు. శాషా అనే విద్యార్థిని ఓవర్‌ఆల్ చాంపియన్‌షిప్ దక్కించుకుందన్నారు. పీడీ లోకేశ్వరి శిక్షణ ఇచ్చారని, పథకాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు.




చాంపియన్ షిప్ ట్రోఫీతో విద్యార్థిని శాషా

ఏదుల్లచెరువుకు భారీ గండి

వృథాగా పోతున్న నీరు

- పత్తాలేని ఇరిగేషన్ అధికారులు
- ఆందోళనలో రైతులు

దుబ్బాక: పట్టణంలోని ఏదుల్లచెరువు మత్తడి వద్ద భారీగండి పడింది. దీంతో నీరంతా వృథాగా పోతోంది. దుబ్బాక–దుంపలపల్లి మధ్య ప్రధాన రహదారి సమీపంలో ఉన్న ఏదుల్లచెరువుకు గండి పడటంతో చెరువంతా ఖాళీ అవుతోంది. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు చెరువులోకి భారీగా వరద నీరుచేరింది. ఈ క్రమంలోనే చెరువు మత్తడి వద్ద మట్టి కొట్టుకుపోయి గండి పడింది. వారం రోజులుగా చెరువులోని నీరంతా పోతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. అధికారులకు సమాచారం అందించినా ఇటు వైపు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గండిని పూడ్చి నీరు పోకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



ఏదుల్లచెరువు నుంచి వృథాగా పోతున్న నీరు

మత్తడి శిథిలం

ఏదుల్లచెరువు మత్తడి పూర్తిగా ముళ్లపొదలతో శిథిలమైనా కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానరోడ్డుకు సమీపంలోనే చెరువు ఉన్నా రోజూ ఈదారి వెంటే ఇరిగేషన్ అధికారులు వెళ్తున్నా పట్టించుకోకపోవడంపై పలువురు మండిపడుతున్నారు.



చెరువు మత్తడిపై ముళ్లచెట్లు

చర్యలు తీసుకుంటాం

ఏదుల్లచెరువు మత్తడి వద్ద గండిపడి నీరంతా వృథాగాపోతున్న విషయం నా దృష్టికి తీసుకొచ్చింది. చెరువు వద్దకు లష్కర్‌ను పంపించాం. గండిని పూడ్చి నీటి వృథాను అరికడతాం.

–ప్రభుదేవ, ఇరిగేషన్, ఏఈ దుబ్బాక

క్లుప్తంగా

కేసీఆర్ సతీమణి పూజలు



వరదరాజస్వామి ఆలయంలో శోభ, చిత్రంలో మాజీ సర్పంచ్ ప్రవీణ్

మర్కుక్(గజ్వేల్): సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం వర్ధరాజ్‌పూర్‌లోని వరదరాజుల స్వామి ఆలయంలో మాజీ సీఎం కేసీఆర్ సతీమణి శోభ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలా భూదేవి అమ్మవారి జన్మదినం పురస్కరించుకొని సోమవారం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలను సమర్పించారు. శోభకు ఆలయ చైర్మన్ గోపాల కృష్ణ, పురోహితులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అప్పాల ప్రవీణ్, పురోహితులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అప్పగింత

- రూ.3.30లక్షల విలువైన ఫోన్లు రికవరీ

గజ్వేల్ : గజ్వేల్ డివిజన్ పరిధిలో పలువురు పోగొట్టుకున్న, దొంగిలించబడిన రూ.3.30లక్షల విలువైన 28సెల్‌ఫోన్లను సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్) టెక్నాలజీ ద్వారా పోలీసులు రికవరీ చేశారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ నర్సింహులు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోతే టెన్షన్ పడవద్దని, వెంటనే సీఈఐఆర్‌లో వివరాలను నమోదు చేసుకుంటే త్వరగా ఫోన్ దొరికే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, గౌరారం ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు దహనం



దహనమైన ద్విచక్రవాహనాలు

నారాయణఖేడ్: రెండు బైక్‌లను గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టారు. బాధితుల వివరాల ప్రకారం.. ఖేడ్ పట్టణంలోని దత్తాత్రి కాలనీకి చెందిన మోహన్, శ్రీకాంత్, మధుల ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఆదివారం రాత్రి తమ ఇళ్లముందు ద్విచక్ర వాహనాలను పార్కు చేశారు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పటించడంతో మోహన్, శ్రీకాంత్‌లకు చెందిన వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. దహనమైన వాహనాల్లో పెట్రోలు ఉండటంతో కాలిపోయాయి. మధు వాహనంలో పెట్రోలు లేకపోవడంతో నిప్పంటుకోలేదని, దీంతో పాదల్లోకి నెట్టేసినట్లు భావిస్తున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చేర్యాల(సిద్దిపేట): విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని చిట్యాలలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన వంకాయల ఓజయ్య తన ఆవును రోజు వారి లాగే భావి వద్ద తీసుకెళ్లి మేపుతుండగా విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.60వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): పాముకాటుతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని చండూర్ గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ నర్సింహులు వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన ఊట్ల సత్తమ్మ(75) ఇంట్లో నిద్రిస్తుండగా, తెల్లవారుజామున ఆమె కాలుకు పాము కరిచింది. గమనించిన ఆమె తన కుమారుడు దత్తయ్యకు తెలుపగా వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సత్తమ్మ మృతిచెందింది.

బందీ అయిన బాల్యం!

ఫలించని ఆపరేషన్‌లు

- మారని తల్లిదండ్రులు, యజమానులు
- యేటా పెరుగుతున్న బాల కార్మికులు
- 99 మందికి విముక్తి..54 కేసులు నమోదు



బాలుడితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు



మెదక్ కలెక్టరేట్: బడిలో చదువుకుంటూ సరదాగా గడపాల్సిన చిన్నారుల బాల్యం పనుల్లో బందీ అవుతోంది. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రతియేటా ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరిట ఆరు నెలలకోసారి అధికార బృందం తనిఖీలు చేస్తుంది. కానీ తల్లిదండ్రులు, యజమానులు, విద్యార్థుల్లో మార్పు రావడం లేదు. ఫలితంగా బాల కార్మికుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పేద ప్రజలు తమ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పిల్లలను పనుల్లో పెడుతుండగా, తక్కువ జీతం, ఎక్కువ గంటలు పనిచేయిస్తూ యజమానులు శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు పెడుతున్నారు. అయినా క్షేత్రస్థాయిలో చైతన్యం వచ్చే వరకు ఫలితం కానరాదని సమాజ సేవకులు వాపోతున్నారు.

ఆర్థిక సమస్యే ప్రధాన కారణం

బడీడు పిల్లలు బడిలో కాకుండా బాల కార్మికులుగా మారడానికి ఆర్థిక సమస్యలే ప్రధాన కారణం. తల్లిదండ్రులు లేని పిల్లలు, చదువుకునే ఆర్థిక స్తోమత లేని వారు కొందరైతే.. అమ్మానాన్నల అనారోగ్యం దృష్ట్యా ఆర్థికంగా అండగా ఉండేందుకు పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు. చదువులో ఫెయిలైన విద్యార్థులు, చదువుపై ఆసక్తి లేని వారు సైతం బాల కార్మికులుగా మారి వెట్టి చాకిరీ చేస్తున్నారు.

రెండేళ్లుగా కార్మికులు ఇలా..		
సంవత్సరం	పట్టుబడిన బాలలు	కేసులు
2024 జనవరి (ఆపరేషన్ స్మైల్)	118	27
2024 జూలై (ఆపరేషన్ ముస్కాన్)	46	1
2025 జనవరి (ఆపరేషన్ స్మైల్)	122	25
2025 జూలై (ఆపరేషన్ ముస్కాన్)	99	54

పిల్లలను ప్రోత్సహించాలి



ఈ నెల 1న చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్‌లో ఇప్పటి వరకు 99 మంది బాల కార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పించాం. అలాగే జిల్లా వ్యాప్తంగా 54 కేసులు నమోదు చేశాం. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జరగాలంటే ముఖ్యంగా తల్లిదండ్రులు, సంరక్షకులు, యజమానుల్లో మార్పు రావాలి. బడీడు పిల్లలను బడికి వెళ్లేలా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పిల్లలే అత్యధికంగా ఉన్నారు. ఎవరైనా బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే రూ.20వేల జరిమానాతోపాటు కేసు కూడా నమోదవుతుంది. ఈనెలాఖరు వరకు ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతుంది.

– కరుణశీల, బాలల సంరక్షణ అధికారి, మెదక్

బురద పొలంలో పడి రైతు మృతి



భిక్షపతి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు కాలు జారి బురద పొలంలో పడి రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో జరిగింది. ఎస్‌ఐ సమత వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చెక్క భిక్షపతి (38) వ్యవసాయం చేసుకుంటూ భార్య బాలమణి, ఇద్దరు కొడుకులు, ఒక కూతురుతో పాటు, తల్లి బాలమ్మను పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో పనులు చేసుకోవడానికి పొలం ఒడ్డుపై నడుస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బురద పొలంలో పడిపోయాడు. బురదలో తల కూరుకు పోవడంతో ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన పరిసర ప్రాంత రైతులు హుటాహుటిన దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపల కోసం వెళ్లి యువకుడు..



ప్రవీణ్ మృతదేహం

తూప్రాన్: ప్రమాదవశాత్తు యువకుడు చెరువులో పడి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని అల్లాపూర్ పెద్ద చెరువు వద్ద జరిగింది. ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం... పాపన్నపేట మండలం నార్సింగికి చెందిన టంటం ప్రవీణ్(30) కొంత కాలంగా పట్టణంలోని గీతారెడ్డి కాలనీలో భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. అడ్డా కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం అడ్డాపై పని దొరకకపోవడంతో చేపలు పట్టేందుకు అల్లాపూర్ శివారులోని తిమ్మాయ చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో చెరువులో పడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య లలిత, బాబు, పాప ఉన్నారు.

భూ తగాదాలతో.. మనస్తాపానికి గురై..



మల్లేశ్ మృతదేహం

గజ్వేల్‌రూరల్: ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు చెందిన శ్రీరాం మల్లేశ్(59) కుటుంబ సభ్యులకు పట్టణంలోని లక్ష్మీప్రసన్నకాలనీలో గల భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన మల్లేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి మల్లేశ్‌ను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లేశ్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోవా మద్యం బాటిళ్ల స్వాధీనం



పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లతో నిందితుడు

జహీరాబాద్ టౌన్ / మునిపల్లి(అందోల్): గోవా నుంచి అక్రమంగా తీసుకువస్తున్న మద్యం బాటిళ్లను జిల్లా టాస్క్‌ఫోర్స్(డీటీఎఫ్) టీం సభ్యులు పట్టుకున్నారు. సోమవారం మండలంలోని చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద డీటీఎఫ్ సీఐ శంకర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందన యశ్వంత్‌రెడ్డి తన కారులో వివిధ బ్రాండ్స్‌కు చెందిన 162 మద్యం బాటిళ్లు తీసుకొస్తుండగా పట్టుకున్నారు. అతడ్ని అరెస్టు చేసి మద్యం బాటిళ్లతో పాటు కారును స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో ఎస్‌ఐలు హనుమంతు, అనుదీప్, రామేష్, మురళీ, ఉమారాణి ఉన్నారు.

మృత శిశువు ఘటనపై విచారణ

- వెలుగులోకి రానున్న నిజాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని కేశనాయక్‌తండా గ్రామ పరిధిలోని లచ్చానాయక్‌తండా పక్కనే ఉన్న వాగులో నవజాత శిశువు మృతదేహం లభించిన ఘటన తెలిసిందే. అందులో భాగంగా సోమవారం ఈ ఘటనపై ఎస్‌ఐ చాతరాజు ప్రశాంత్ అధ్వర్యంలో పోలీసులు అన్ని కోణల్లో విచారణను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాలకు చెందిన వారెవరైనా మృతదేహన్ని తీసుకొవచ్చి పడేశారా? లేదా ఇతర ప్రాంతాలకు చెందిన వారెవరైనా ఇక్కడికి తెచ్చి పడేసి వెళ్లారా? అవాంఛిత గర్భం దాల్చిన మహిళ గర్భ స్రావం చేయించుకొని ఇక్కడ పడేశారా? అని పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ ప్రశాంత్‌ను సాక్షి సంప్రదించగా వాగులో నవజాత శిశువు మృతదేహం లభ్యంపై విచారణ చేపడుతున్నామని తెలిపారు.

మందు బాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్ : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. ఈ ఘటన సంగారెడ్డి పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి కథనం ప్రకారం... ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, బైపాస్‌లోని గుర్రం బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్ధిఖీ ఐదు మందికి రూ.2వేలు, ముగ్గురికి రూ.1500, మిగతా నలుగురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

వెనుకనుంచి కారు.. ముందు నుంచి లారీ ఢీ

- ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి

పటాన్‌చెరు టౌన్: ద్విచక్ర వాహనాన్ని రెండు వాహనాలు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు.ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని బచ్చుగూడెం గ్రామానికి చెందిన రాంరెడ్డి (54) పటాన్‌చెరు శివారులో ఉన్న ఓ భవన నిర్మాణ సంస్థ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి విధులకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా క్రికెట్ శిక్షణ కేంద్రం సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. అనంతరం అజాగ్రత్తగా అతివేగంగా వస్తున్న లారీ ముందు నుంచి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వృత్తి నటన.. ప్రవృత్తి దొంగతనం

- చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్

సంగారెడ్డి క్రైమ్ : మహిళ మెడలోంచి మంగళ సూత్రం ఎత్తుకెళ్లిన నిందితులను అరెస్టు చేసి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేష్ కేసు వివరాలు వెల్లడించారు. రేగోడు మండలానికి చెందిన గోరం అనీల్(25),గోరం సునీల్ (23) ఇద్దరు అన్నదమ్ములు. పటాన్‌చెరువులోని గౌతమ్ నగర్‌లో అద్దెకు ఉంటూ సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టులుగా జీవనం కొనసాగిస్తున్నారు. పట్టణంలోని అయ్యప్ప కాలనీకి చెందిన ఇందిరి లక్ష్మి ఈనెల 22న సాయంత్రం నాలుగు గంటల సమయంలో బైపాస్‌లోని రిషీ స్కూల్ నుంచి తన మనవరాలుని ఇంటికి తీసుకెళ్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలోంచి బంగారాన్ని ఎత్తుకెళ్లారు. అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం పట్టణంలోని ఐబీ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, యమహ ద్విచక్ర వాహనంపై అటుగా వచ్చిన ఇద్దరు అనుమానితులను అరెస్టు చేసి విచారించగా.. నేరం అంగీకరించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి యమహ ద్విచక్ర వాహనం, ఫోన్, మూడు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట పట్టణ ఎస్సై రాజశేఖర్, సర్దార్,హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, కానిస్టేబుల్ నగేంద్రబాబు,ప్రదీప్,శివకుమార్ ఉన్నారు.

తీర్థయాత్రలకు వెళ్లి.. తిరిగి రాని లోకాలకు..

- చిత్తూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చేర్యాల యువకుడు మృతి
- నలుగురికి గాయాలు



బొడ్డు భరత్

చేర్యాల(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... పట్టణ కేంద్రానికి చెందిన బొడ్డు గౌరీనాథ్‌కు ఇద్దరు కుమారులు, చిన్న కుమారుడు బొడ్డు భరత్(20)హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. శుక్రవారం తన మిత్రులతో కలిసి కారులో అరుణాచలం వెళ్లాడు. అరుణాచలం గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం అక్కడి నుంచి తిరుపతికి బయలుదేరారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఆంధ్రప్రదేశ్, చిత్తూరు సమీపంలోకి రాగానే కారు టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న భరత్ కారులో నుంచి బయటపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ భరత్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మిగతా నలుగురు గాయపడగా వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. భరత్ మృతదేహం చిత్తూరు ఆస్పత్రిలో ఉంది. తాను ట్రిప్‌లో అరుణాచలం, తిరుపతికి వెళుతున్నానని, అమ్మానాన్నకి చెప్పిన భరత్ కారు ప్రమాదంలో మృతి చెందడంతో కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, మిత్రులు అంతా శోక సంద్రంలో మునిగిపోయారు.

బైక్ అదుపుతప్పి కిందపడటంతో..

జహీరాబాద్ టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామ శివారులో జరిగింది. రూరల్ ఎస్‌ఐ.కాశీనాథ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రేజింతల్ అంజన్న(34) మండలంలోని గోవింద్‌పూర్ వద్ద గల వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీరప్పనా.. మజాకా..

- సస్పెండైనా రికార్డుల తనిఖీ
- అడ్డుకున్న గ్రామస్తులు



కంప్యూటర్‌పై కూర్చున్న ఇతర ప్రాంతానికి చెందిన కార్యదర్శి



కార్యాలయానికి వచ్చిన కార్యదర్శులను నిలదీస్తున్న గ్రామస్తులు

జహీరాబాద్: మండలంలోని తూంకుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి బీరప్ప ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యాడు. కాగా మరో కార్యదర్శిని తీసుకువచ్చి కంప్యూటర్‌లో రికార్డులను తనిఖీ చేసే ప్రయత్నం చేయగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆదివారం బీరప్ప ఇతర ప్రాంతానికి చెందిన కార్యదర్శిని తీసుకొచ్చి పంచాయతీ రికార్డులను తారుమారు చేసే ప్రయత్నం చేశారని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామస్తులు కార్యదర్శులను అడ్డుకోవడంతో అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ మహేందర్‌రెడ్డిని వివరణ కోరగా తమకు సమాచారం ఇవ్వకుండా కార్యాలయానికి వెళ్లడం సరైంది కాదన్నారు. గ్రామస్తుల నుంచి సమాచారం అందగా వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించామన్నారు. తమకు రికార్డులను అప్పగించే వరకు వివరాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. హుగ్గెల్లి తండాకు చెందిన కార్యదర్శి సమతకు సోమవారం అదనపు బాధ్యతలు ఇచ్చినట్లు తెలిపారు. సస్పెన్షన్‌కు గురైన బీరప్ప మంగళవారం రికార్డులను తమకు సమర్పించనున్నట్లు వివరించారు.

'మంజీరా'లో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



శాయిబాజ్ మృతదేహం

పాపన్నపేట(మెదక్): మంజీరా నదిలో గల్లంతైన శాయిబాజ్ (26) మృతదేహం ఎట్టకేలకు సోమవారం సాయంత్రం దొరికింది. మిత్రులతో కలిసి చేపల వేటకు వెళ్లిన బాచారం గ్రామానికి చెందిన శాయిబాజ్ ఆదివారం ముద్దాపూర్ బ్రిడ్జి కింద గల్లంతయ్యాడు. అతని తండ్రి గౌస్ పాషా ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తన బృందాలతో కలిసి వెతికినప్పటికీ ఆచూకి లభించలేదు. దీంతో సోమవారం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఫైర్, పోలీస్, రెవెన్యు అధికారులు తమ బృందాలతో ఎయిర్ బోట్‌లు, స్కానర్‌లతో కలిసి గాలించారు. మంజీరా నది వెడల్పు 400 మీటర్లు, లోతు 30 నుంచి 40 ఫీట్లు ఉండటంతో గాలింపు చర్యలు సత్ఫలితం ఇవ్వలేదు. ఎట్టకేలకు సాయంత్రం బ్రిడ్జికి 30 మీటర్ల దూరంలో మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా తమ కొడుకు మృతి పట్ల వెంట వెళ్లిన అతని మిత్రులపై అనుమానం ఉందని గౌస్‌పాషా ఆరోపించారు.

మార్కెట్‌కు టమాటా



ట్రాక్టర్‌పై టమాటాలు తరలిస్తున్న రైతు

సంగారెడ్డి పాత బస్టాండ్ గంజ్ మైదాన్ ఆవరణలో ప్రతి సోమవారం కూరగాయల మార్కెట్ నిర్వహిస్తారు. సంగారెడ్డి చుట్టు పక్కల గ్రామాలతో పాటు, జహీరాబాద్, శంకర్‌పల్లి, వికారాబాద్, సింగూర్‌ల నుంచి కూరగాయలు తెచ్చి విక్రయిస్తున్నారు. సోమవారం ఓ రైతు తన పొలంలో పండిన టమాటాలను ట్రేలలో నింపి ట్రాక్టర్ వెనుక నాగలిపై తాళ్లతో గట్టిగా బిగించాడు. కలెక్టరేట్ ముందు నుంచి వెళ్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

లంచం అడిగిన డీపీవోపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: తనను విధుల్లోకి తీసుకోవాలంటే ఓ అధికారి రెండు లక్షల లంచం అడిగాడని సంగారెడ్డి కలెక్టరేట్‌లో వ్యక్తి సోమవారం ఫిర్యాదు చేశాడు. పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామ పంచాయతీ పూర్వ కారోబార్ పాండు గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ... తాను గ్రామ పంచాయతీలో 2013 వరకు కారోబార్‌గా విధులు నిర్వహించానని చెప్పాడు. తన భార్య అప్పట్లో ఎంపీటీసీగా బరిలో నిలబడటం ఓర్వలేక తనపై అప్పటి జిల్లా అధికారులకు, గ్రామ నాయకులకు ఫిర్యాదు చేయడంతో తనను విధుల నుంచి తొలగించారన్నారు. తాను హైకోర్టుకు వెళ్లి రిట్ పిటిషన్ నెం. 20755 ఆఫ్ 2019 ద్వారా విధులు నిర్వహించుకునేలా డీపీవోకు కోర్టు ఆదేశాలు ఇచ్చిందని వివరించారు. అప్పటి డీపీవో తనకు జాయినింగ్ ఆర్డర్ ఇస్తే నాటి సర్పంచ్ జాయిన్ కానివ్వలేదన్నారు. 2024 డిసెంబర్‌లో తిరిగి జాయిన్ చేయాలని ఆర్డర్ తెచ్చుకున్నానని తెలిపారు. విధుల్లో చేరేందుకు పర్మిషన్ ఇవ్వాలని సంగారెడ్డి డీపీవోను ఎన్నిసార్లు కోరినా నిర్లక్ష్యం ప్రదర్శించాడన్నారు. చివరికి ఓ వ్యక్తి పేరు చెప్పి అతడిని కలవాలని డీపీవో సూచించారని చెప్పాడు. డీపీవో కార్యాలయ సిబ్బంది ఓ వ్యక్తిని పంపించి రూ. 2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయించారని ఆరోపించారు. తాను రూ.లక్ష వరకు ఇస్తానని చెప్పానన్నారు. డీపీవో లంచ గొండితనంతో విసిగిపోయి ప్రజావాణిలో ఫిర్యాదు చేశానన్నారు. ఫిర్యాదుపై కలెక్టర్ విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

- 9వ,11వ తరగతుల్లో అడ్మిషన్లకు అవకాశం
- సెప్టెంబర్ 23 వరకు దరఖాస్తుల స్వీకరణ
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ఎంట్రెన్స్ పరీక్ష



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): ఆశ్రమ విద్యతో బాల బాలికల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వాలు బాటలు వేస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి గాను 9వ,11వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడింది. అర్హులైన విద్యార్థులు ఎంట్రెన్స్ పరీక్ష రాసేందుకు సెప్టెంబర్ 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఫిబ్రవరి 7న (లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్) ఎంపిక పరీక్ష జరుగుతుందని, అందులో ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు www.navodaya.gov.in ద్వారా సెప్టెంబర్ 23 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు ప్రోత్సహించాలని కోరారు. అభ్యర్థులకు అర్హత, పరీక్ష సిలబస్ తదితర విషయాలను వివరించారు.

ఇవిగో అభ్యర్థుల అర్హతలు

- ప్రవేశం పొందే బాలబాలికలు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెంది, వారి తల్లిదండ్రులు ఇక్కడే నివాసం ఉండాలి.
- 9వ తరగతిలో ప్రవేశం కోసం అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరం(2025-26)లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఉండాలి. అభ్యర్థి మే 1, 2011 నుంచి జూలై 31, 2013 మధ్య జన్మించి ఉండాలి.
- 11వ తరగతిలో ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరం(2025-26)లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదువుతూ ఉండాలి. జూన్ 1, 2009 నుంచి జూలై 31, 2011 మధ్య జన్మించి ఉండాలి.

9వ తరగతి పరీక్ష సిలబస్

హిందీ, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, సైన్స్‌కు చెందిన ప్రశ్నలు ఉంటాయి. ఓఎమ్‌ఆర్ ఆధారిత ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నపత్రం ఉంటుంది.

11వ తరగతి పరీక్ష సిలబస్

మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, సైన్స్, సోషల్ సైన్స్‌కు చెందిన ప్రశ్నలు ఉంటాయి. ఓఎమ్‌ఆర్ ఆధారిత ఆబ్జెక్టివ్ టైప్‌లో పరీక్ష ఉంటుంది. హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నపత్రం ఉంటుంది. ఇతర వివరాలకు నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్‌లో చూడొచ్చు.